ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

గురువారం 9 జనవరి 2025

ములుగులో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

- పోటాపోటీ నిరసనలతో ఉద్రిక్తత
- కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించిన బీజేపీ కార్యకర్తలు
- మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- బీజేవైఎం నాయకుడి బుక్‌స్టాల్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

6



ములుగు ఏరియా ఆస్పత్రి కూడలిలో చిరిగిన కాంగ్రెస్ ఫ్లెక్సీలు

పరిహారం కోసం పోరు



ట్రెంచ్ పనులను అడ్డుకుంటున్న రైతులు

- చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు పనులపై ఎల్కేశ్వరం రైతుల నిరసనలు
- దశల వారీ ఆందోళనలు.. అడ్డగింతలు
- పరిహారం ఇచ్చాకే కెనాల్ నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్
- పోలీసు బందోబస్తు నడుమ పనులు.. తీవ్ర ఉద్రిక్తత

మహదేవపూర్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం రైతుల పోరు ఉధృతమైంది. చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మందరం చెరువు నుంచి ఎన్కపల్లి వరకు నిర్మించనున్న మెయిన్ కెనాల్ పనులను ఎల్కేశ్వరం రైతులు అడ్డుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తోంది. తమ భూములను సేకరించిన అధికారులు పరిహారం ఇచ్చాకే పనులను ప్రారంభించాలని రైతులు భీష్మించుకున్నారు. 12 రోజులుగా వీరు దశల వారీగా నిరసనలకు దిగుతున్నారు. ఐదు రోజులుగా వీరి పోరాటం మరింత ఉధృతమవుతోంది. పనులు చేపట్టేందుకు అధికారులు రావడం, వారిని రైతులు అడ్డుకోవడం లాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో మంగళవారం భారీ పోలీసు బందోబస్తు నడుమ అధికారులు పనులు ప్రారంభించేందుకు యత్నించగా రైతులు మళ్లీ అడ్డుకున్నారు. పోలీసులు వారిని నిలువరించేందుకు యత్నించగా తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఈ క్రమంలో రాళ్లబండి రజిత అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది.

ట్రెంచ్ పనులు చేపడుతుండగా..

తాజాగా అధికారులు బుధవారం భారీ పోలీసు బందోబస్తుతో కెనాల్ పనులను చేపట్టేందుకు రాగా ఎల్కేశ్వరం రైతులు మళ్లీ నిరసనకు దిగారు. పనులను అడ్డుకొనేందుకు యత్నించగా వారిని పోలీసులు నిలవరించారు. ఇరిగేషన్ అధికారులు కెనాల్‌కు ఇరువైపులా ట్రెంచ్ పనులు ప్రారంభించగా ప్రొక్లెయినర్ ఎదుట బురదలోనే బైఠాయించి అడ్డుకున్నారు. పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలని భీష్మించు కున్నారు. అయినా అధికారులు పనులను ఆపకపోవడంతో రాళ్లబండి కమల మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో పోలీసులు తమ వాహనంలోనే ఆమెను మహదేవపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి రిఫర్ చేసినా కుటుంబ సభ్యులు అక్కడికి తీసుకెళ్లేందుకు ససేమిరా అన్నారు. ఈసందర్భంగా కమల కుమారుడు రవి మాట్లాడుతూ పోలీసులు రైతుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరిస్తూ తన తల్లిని ఈడ్చుకుంటూ తీసుకెళ్లా ఆరోపించాడు. మహదేవపూర్ ఆస్పత్రిలో జాయిన్ చేశాక కూడా తమకు సమాచారం ఇవ్వలేదన్నాడు. మంగళవారం ఒంటిపై పెట్రోల్ పోసుకున్న రజిత మాట్లాడుతూ పురుగుల మందు తాగిన కమల తన తల్లి అని, అధికారులు తమ కుటుంబానికి అన్యాయం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించింది. తన తల్లిని వృద్ధురాలు అని కూడా చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరు అవమానవీయంగా ఉందన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ తమ తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం దౌర్జన్యంగా తీసుకుని అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ భూములను రీసర్వే చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు.



ట్రెంచ్ పనులను అడ్డుకుంటున్న మహిళను తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

అధికారుల్లో కొరవడిన స్పష్టత

మందరం చెరువు నుంచి ఎన్కపల్లి వరకు నిర్మించనున్న మెయిన్ కెనాల్ భూసేకరణ, పరిహారంపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల్లో స్పష్టత కొరవడింది. కాల్వ నిర్మాణానికి ఎంత భూమి సేకరించారు.. ఎంత మందికి పరిహారం ఇచ్చారనేది క్లియర్ చేయడం లేదు. రెవెన్యూ అధికారులు 110 ఎకరాలని చెబుతుండగా, ఇరిగేషన్ అధికారులు 62 ఎకరాలనే పేర్కొంటున్నారు. రైతులు పరిహారం రాలేదంటున్నారు కదా ?అని తహసీల్దార్ ప్రహ్లాద్‌ను వివరణ కోరగా దీనిపై ఆయన స్పష్టత ఇవ్వడం లేదు. కొంత మందికి పరిహారం వచ్చిందని, ఇంకొంత మందికి రాలేదని ఆయన అంటున్నా నిర్దిష్ట సంఖ్య చెప్పడం లేదు. ఎల్కేశ్వరంలో ఏడుగురికి పరిహారం రాలేదని తెలియగా అదే విషయాన్ని ఉన్నతాధికారులకు రిపోర్టు చేశామని తెలిపారు. మహదేవపూర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కమల వద్దకు వచ్చిన తహశీల్దార్ ప్రహ్లాద్ ఆమె ఆరోగ్యపరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సమసయంలో పరిహారంపై రైతులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నించగా సమాధానం చెప్పకుండానే ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

ఇదే క్రమంలో కమల కుమారుడు రవి

మిగతా 8వ పేజీలో...

సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కమలాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మహాత్మాగాంధీ ఉపాధిహామీ నిధులు రూ.50 లక్షలతో భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో సీసీరోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణాలకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలందరికి న్యాయం జరుగుతోందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. ఇటీవల కమలాపూర్ గ్రామంలో అప్పుల బాధతో మృతి చెందిన దంపతుల పిల్లల్ని పరామర్శించారు. చిన్నారులకు భూపాలపల్లి మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో అడ్మిషన్ ఇవ్వాలని అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు చంద్రయ్య, సీనియర్ నాయకులు చాడ రఘునాథరెడ్డి, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సేకరణను వేగవంతం చేయండి


జెన్‌కో సీఎండీకి మాజీ ఎమ్మెల్యే మధు వినతి



జెన్‌కో సీఎండికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే, నిర్వాసితులు

మల్హర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జెన్ కో ఓపెన్‌కాస్టు బొగ్గు గనుల తవ్వకాల్లో భాగంగా పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్లు, మిగులు భూముల సేకరణను వేగవంతం చేసి త్వరితగతిన పరిహారం అందించాలని కోరుతూ ఆ సంస్థ సీఎండీ, విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు భూనిర్వాసితులతో కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో జెన్‌కో సీఎండీని బుధవారం కలిశారు. తాడిచర్ల బ్లాక్-1లో పెండింగ్‌లో ఉన్న మిగులు భూములు, ఇళ్లను సేకరించి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన మొగిళి, నిర్వాసితులు అర్ని సత్యనారాయణ, రామిడి గట్టయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి నాపాక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన నాపాక ఆలయం

చిట్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నైన్‌పాక గ్రామ శివారులోని నాపాక సర్వతోభద్ర దేవాలయంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా ఇవి జరగనున్నాయి. ఈ వేడుకలకు జిల్లాతో పాటు వరంగల్, హనుమకొండ , జమ్మికుంట, పెద్దపల్లి జిల్లాల నుంచి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ యాదండ్ల రాజయ్య తెలిపారు. గురువారం గణపతి పూజ, పుణ్యాహవచనం, హోమం, శుక్రవారం ఉత్తరద్వారా దర్శనం, స్వామి వారి ఎదురుకోళ్లు, లక్ష్మీనారాయణస్వామి కల్యాణం, జాతర, అన్నప్రసాదం, కోలాట బృందాల ప్రదర్శన ఉంటుందని ప్రధాన అర్చకుడు ప్రభాకరాచార్యులు తెలిపారు. శనివారం బండ్లు తిరుగుట, స్వామి వారికి నవధాన్యం సమర్పించడం, ఉత్సవమూర్తుల విగ్రహాల ఊరేగింపుతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

క్రైం కార్నర్

ఆస్తి కోసం దారుణం

- తండ్రిపై కత్తితో దాడి చేసిన కొడుకులు
- తల్లితో కలిసి మెడను కోసిన వైనం
- చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న తండ్రి



తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్

మొగుళ్లపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తండ్రి ఆస్తి పంచడం లేదని కొడుకులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. తల్లితో కలిసి కత్తితో మెడను కోసి హత్యాయత్నం చేశారు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... బంగ్లపల్లి గ్రామంలోని శాపారపు శ్రీనివాస్, కల్యాణి దంపతులకు ముగ్గురు కుమారులు భరత్, హర్షిత్, బన్నీ ఉన్నారు. శ్రీనివాస్‌కు ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. శ్రీనివాస్ బతుకుదెరువు కోసం పదేళ్లుగా దుబాయిలో నివసిస్తున్నాడు. మూడు నెలల క్రితమే స్వగ్రామానికి వచ్చేసిన శ్రీనివాస్‌ను ఆరెకరాల భూమిని భార్యతోపాటు ముగ్గురు కుమారులు తమ పేర్లపై పట్టా చేయాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పలుమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. కుటుంబం కోసం చేసిన అప్పులు కట్టాకే ఆస్తుల పంపకం చేస్తానని శ్రీనివాస్ భీష్మించుకున్నాడు. దీంతో అతడిపై కోపం పెంచుకున్న ముగ్గురు కొడుకులు, భార్య కలిసి అతడిపై కత్తితో దాడి చేశారు. మెడ కింద భాగంలో కోసి హత్యాయత్నం చేశారు. దీంతో అతడు తప్పించుకుని ఇంట్లోంచి కేకలు పెడుతూ బయటకు పరుగెత్తాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు శ్రీనివాస్‌ను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అతడు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. అతడిపై దాడి చేసిన భార్య, ముగ్గురు కుమారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

చిన్నారిపై లైంగికదాడి కేసులో యువకుడి అరెస్టు

మహాముత్తారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చిన్నారిపై లైంగికదాడి కేసులో యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహాముత్తారం ఎస్సై మహేందర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడు ఎల్లది నరేష్ ఇటీవల లైంగికదాడికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా చిన్నారి ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఈ అఘాయిత్యం చేశాడు. ఇది ఆలస్యంగా వెలుగు చూడగా పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ ట్రక్ డ్రైవర్ మృతి



అన్వర్ పాషా (ఫైల్)

గణపురం, జనవరి 8: భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధి ఓపెన్ కాస్ట్-3లో పనిచేస్తున్న వోల్వో ట్రక్ డ్రైవర్ అన్వర్ పాషా (38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండల కేంద్రానికి చెందిన అన్వర్ పాషా ఓసీ-3లో ట్రక్ డ్రైవర్‌గా కాంట్రాక్ట్ ప్రాతిపాదికన పని చేస్తున్నాడు. ఈనెల 2న రాత్రి సమయంలో విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు ట్రక్ అదుపు తప్పింది. ఈ క్రమంలో ముందున్న ట్రక్‌ను ఢీకొనడంతో అన్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో అన్వర్ పాషా బుధవారం మృతి చెందాడు. మృతుడికి

మిగతా 8వ పేజీలో...

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందులో భాగంగానే స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ ఉత్పత్తి కేంద్రాలకు టెండర్లు ఖరారు చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖతోపాటు ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి లోకేష్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ దివాకర హాజరయ్యారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయని, ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను పెద్ద మొత్తంలో అందిస్తూ వారు వివిధ వ్యాపారాలు చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి జిల్లాలో కనీసం 150 ఎకరాల భూమిని గుర్తించి సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుపై ఈనెల 20 వరకు నివేదికలు అందించాలన్నారు. ఇందుకు కలెక్టర్లు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబరు 19న కుదిరిన ఒప్పందాన్ని కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని అన్నారు. దేవాదాయ, అటవి, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలన్నారు.

అటవీ హక్కుల భూముల్లో అవకాడో వంటి పంటలను సాగుచేస్తే గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. ఆర్‌వోఆర్ఎఫ్ పట్టాలు ఇచ్చిన భూములు కొన్ని చోట్లా నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉంటున్నాయని, విద్యుత్ స్తంభాలు వేసేందుకు అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సోలార్ ప్లాంటు ద్వారా బోరు వేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తే రైతులు పెద్దమెత్తున డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి ఎస్ఈ మల్సూర్‌నాయక్, ములుగు అదనపు కలెక్టర్ సంపత్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ములుగు కలెక్టర్ దివాకర

ట్రైసైకిళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న దివ్యాంగులు ట్రైసైకిళ్లు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ జిల్లా అధికారి చెన్నయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు 11 ట్రైసైకిళ్లు వచ్చాయని, అవసరమున్న వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందిస్తామని పేర్కొనారు. మరిన్ని వివరాలకు 9652311804 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి



మండల కేంద్రంలో కళాకారులతో ఎమ్మార్పీఎస్, బీజేపీ నాయకులు

కాటారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి డిమాండ్ చేశారు. 'వేల గొంతుకలు-లక్ష డప్పులు' పేరిట నిర్వహించే ఎమ్మార్పీఎస్ సభకు సన్నాహకంగా మాదిగ దండోరా కళాకారులు చేపట్టిన రథయాత్ర బుధవారం కాటారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడుతూ వర్గీకరణను వ్యతిరేకించే వారు ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. దేశంలో అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్న వారికి న్యాయం జరగాలని, అంబేద్కర్ రిజర్వేషన్లు కల్పిస్తే వాటితో కొందరు సంపన్నులకే ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయని అన్నారు. 59 కులాలకు సమన్యాయం జరగాలని 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ పోరాటం చేస్తుండగా ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణ సహేతుకమేనని తీర్పునిచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలోనే మొదటగా వర్గీకరణ చేస్తానని హామినిచ్చి మాట తప్పారని విమర్శించారు. రథయాత్రకు బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంథెన చిరంజీవి, బొడ్డు రాజబాపు, భిక్షపతి, ఆశయ్య, సురేష్, సమ్మయ్య, శ్రీనివాస్, చంద్రయ్య, చిన్ని, మహేష్, సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కాస్తులో ఉన్న రైతులకూ భరోసా ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి

ములుగు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాస్తులో ఉన్న రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో ఎమ్డీ.దావూద్ అధ్యక్షతన బుధవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుభరోసా సాగుకు యోగ్యమైన భూములకు ఇస్తామని అసెంబ్లీలో ప్రకటించిందని, జిల్లాలో అనేకమంది రైతులు పట్టాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు వర్తించడంలేదన్నారు. కాస్తు కబ్జాలో ఉన్న ప్రతిరైతుకు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా కూలీబంధు వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని ప్రకటించి ఉపాధి హామీ పథకంలో వందరోజులు పనిచేస్తేనే ఇది వర్తిస్తుం దని పేర్కొనడం విడ్డూరమన్నారు. గ్రామసభల ద్వారా కూలీలను ఎంపిక చేసి అర్హులైన పేదలకు కూలీబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యు డు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు రత్నం రాజేందర్, వాసు, రఘుపతిరావు, మల్లారెడ్డి, చిన్నా, రాజేష్, చిరంజీవి, తీగల ఆదిరెడ్డి, గుగ్గిళ్ల దేవయ్య, దామోదర్, కృష్ణబాబు, నర్సింహచారి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో కాళేశ్వరాలయంలో మహా కుంభాభిషేకం

మహదేవపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తీశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు వెల్లడిం చారు. 1982లో జీర్ణోద్ధరణ సమయంలో మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్వహించకపోవడంతో 43 సంవత్సరాల తర్వాత దేవాదాయ ధర్మా దాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్ దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరిలో మహాకుంభాభిషేకాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో వేద పండితుల ముహూర్తం మేరకు ఖరారు చేశారు.

జీరో టిల్లేజీ మొక్కజొన్న సాగుపై క్షేత్ర ప్రదర్శన

వెంకటాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని నర్సాపూర్ క్లస్టర్ పరిధిలోని ఇంచెంచెరువుపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా బుధవారం జీరో టిల్లేజి పద్ధతిలో రబీ మొక్కజొన్నలో క్షేత్రప్రదర్శన జరిగింది. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి శైలజ మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో పంట సాగు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ క్రమంలోనే చాలామంది రైతులు తక్కువ ఖర్చులో అనువుగా ఉన్న జీరో టిల్లేజి వ్యవసాయం వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందన్నారు. రబీలో వరి సాగుకు సరిపడా నీరు అందుబాటులో లేకుంటే వరి మాగాణుల్లో మొక్కజొన్న సాగుచేస్తే అధిక దిగుబడితో పాటు చీడపీడల సమస్య ఉండదన్నారు. ఈవిధానంలో ఎకరాకు 8కిలోల విత్తనం సరిపోతుందని, వరుసలకు మధ్య 60సెంటి మీటర్లు మొక్కకు మొక్కకి మధ్య 20 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవా లన్నారు. ఎకరాకు 80-96కిలోల నత్రజని, 32కిలోల భాస్వరం, 32కిలోల పొటాష్నిచ్చే ఎరువులు వేసుకోవాలని, జీరో టిల్లేజి విధానంలో మొక్కజొన్న సాగుచేయడం వల్ల పంటదారులకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు కావాల్సిన యంత్రాలపై పెట్టే ఖర్చు తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాస్, నరసింహ, లక్ష్మణ్, నరేష్, భరత్, రైతులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సరైన పత్రాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలతో పాటు వాటిని సీజ్ చేయడం జరుగుతుందని గూడూరు సీఐ బాబురావు హెచ్చరించారు. గూడూరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి విలువైన ప్రాణాలు కోల్పోవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రు లపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఈ తనిఖీల్లో కొత్తగూడ ఎస్సై కుశకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల మాటేంటి?

- నిర్మాణం పూర్తయినా పంపిణీకి నోచని వైనం
- వాటి ఊసే ఎత్తని రాష్ట్ర ప్రభుత్వం
- కొత్త ఇళ్లు నిర్మించేందుకే సర్కారు మొగ్గు

తొర్రూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సొంత ఇండ్లు లేని నిరుపేదలకు పక్కా ఇండ్లు నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితి ఏమిటి అనేది సందిగ్ధంలో పడింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పంపిణీకి నోచుకోలేదు. అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్ల నిర్మించిన ఇండ్లు వృథాగా పడి ఉన్నాయి. రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించడంతో ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇండ్ల భవిష్యత్‌పై నీలి నీడలు అలుముకున్నాయి. ప్రభుత్వం ఇటీవల స్థలాలు ఉన్న వారికి నిబంధనల మేరకు ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించడంతో గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌ల ప్రస్తావన తీయకపోవడంతో ఆ ఇండ్ల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారనుంది.



ధ్వంసమైన కిటికీ అద్దాలు

మునిసిపాలిటీ పరిధిలోని దుబ్బతండా వద్ద నిర్మాణం పూర్తయిన 280 ఇండ్లు పంపిణీ చేపట్టకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మద్యం సేవించడం, జూదం ఆడటం, ఇతర కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇండ్లకు బిగించిన కిటికీలు, తలుపులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

చోరీకి గురవుతున్నాయి. కంప చెట్లు పెరిగి వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్గంధం వస్తోంది. కోట్ల రూపాయలతో నిర్మించిన ఇండ్లు పంపిణీకి ముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇండ్ల పంపిణీ చేపట్టాలని అర్హులైన లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఇండ్ల పంపిణీ చేపడతామన్నారు.

పూర్తయిన సర్వే

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించింది. వాటిల్లో తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో 1250 మంది లబ్ధిదారులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని దుబ్బతండా వద్ద బహుళ అంతస్తుల విధానంలో 280 ఇండ్ల నిర్మాణం పూర్తిచేసి సంవత్సరం దాటింది. సిబ్బంది చేపట్టిన సర్వే పరిశీలనలో 40 శాతం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. మిగిలిన జాబితాలను నోటీసు బోర్డులపై ఉంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. దీంతోపాటు మండలంలోని గుర్తూరు, మాటేడు గ్రామాల్లో ఇండ్ల నిర్మాణం పూర్తైనప్పటికీ కొందరు లబ్ధిదారులు అనధికారికంగా ఇండ్లలోకి చేరారు. చింతలపల్లి, అమ్మాపురం, ఖానాపురం, వెల్లికట్ల, వెంకటాపురం గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఇండ్లు నిర్మించలేదు. ప్రభుత్వం ఇండ్లు నిర్మించినా లబ్ధిదారులకు అందించకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దరఖాస్తులు ఎక్కువగా ఉండటంతో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని గతంలో అధికారులు ప్రకటించినా నేటి వరకు ఇండ్లు పంపిణీ చేయలేదు.



వృథాగా ఉన్న దుబ్బతండా సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

ములుగులో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

- పోటాపోటీ నిరసనలతో ఉద్రిక్తత
- కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించిన బీజేపీ కార్యకర్తలు
- మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం
- బీజేవైఎం నాయకుడి బుక్‌స్టాల్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడి



బీజేపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల పోటాపోటీ నిరసనలతో బుధవారం ములుగులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్‌కు చెందిన ఫ్లెక్సీలను బీజేపీ శ్రేణులు చించివేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడి బుక్‌స్టాల్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. హైదరాబాద్‌లోని తమ పార్టీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని నిరసిస్తూ బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో ములుగులో ఆ పార్టీ శ్రేణులు రాస్తారోకో చేశాయి. స్థానిక ఏరియా ఆస్పత్రి కూడలిలో జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన చేసిన కార్యకర్తలు కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పక్కనే సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క ఫొటోలతో కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను చించివేశారు. సీతక్క క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు కూడా ప్రయత్నించారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు బీజేపీ కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ ఫ్లెక్సీలను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఇదే కూడలిలో ఆందోళనకు దిగాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతీయ రహదారిపై ర్యాలీ చేస్తున్న క్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజుకు చెందిన బుక్‌స్టాల్‌పై దాడి చేశారు. బయట ఉన్న సామగ్రిని విసిరేశారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ప్రదర్శనగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేశారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు అశోక్ అన్నారు.

బీజేపీ ఆందోళనల నేపథ్యంలో ఉదయం నుంచే మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయం వద్ద, జాతీయ రహదారిపై పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ములుగు మండల అధ్యక్షుడు ఎమ్డీ. చాంద్‌పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ లకావత్ రాజ్‌కుమా ర్‌తో పాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే.. తన బుక్‌స్టాల్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారంటూ బీజేవైఎం నాయకుడు నాగరాజు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూపాలపల్లి ఆర్డీవో బదిలీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మాలోతు మంగిలాల్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మంగిలాల్‌ను వరంగల్, హనుమకొండ జిల్లాలకు పీఏ టు స్పెషల్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఆయన స్థానంలో వరంగల్, హనుమకొండ జిల్లాలకు పీఏ టు స్పెషల్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఎస్. రవిని భూపాలపల్లి ఆర్డీవోగా బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగానే ఈ స్థాన చలనం కలిగింది.

ఘనంగా గోదాదేవి పూజలు



గోదాదేవి పూజలో పాల్గొన్న భక్తులు

మంగపేట, జనవరి (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం, బోరునర్సాపురం, చెరుపల్లి, తిమ్మంపేట, మల్లూరు, అకినేపల్లి-మల్లారం తదితర గ్రామాల్లో వెలిసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాలల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వేళాల్లో విశేష పూజలను నిర్వహించారు.

బోరునర్సాపురంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ గోదాదేవి అమ్మవారి మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించి పాశురాం కార్యక్రమాలను ప్రధానార్చకుడు జీడికంటి మూర్తి నిర్వహించారు. అలాగే పలు అర్చనలు, అభిషేకాలు, భజనాలు జరిగాయి. అనంతరం గ్రామాల్లో నగర సంకీర్తనను అత్యంత ఘనంగా నిర్వహించారు.

సేంద్రియ పద్ధతులతోనే భూ సంరక్షణ

- 'వలంటరీ' డైరెక్టర్ విజయగౌరి
- జిల్లాలోని ఏఈవోలకు ముగిసిన శిక్షణ



రైతు వేదికలో ఏఈవోల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కేసముద్రం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రసాయనాలు వాడకుండా సేంద్రియ పద్ధతులతోనే కాలుష్యం లేకుండా భూ సంరక్షణ చేపట్టవచ్చని హైదరాబాద్ రాజేంద్రనగర్ నీరు, భూమి యాజమాన్య శిక్షణ, పరిశోధన సంస్థ (వలంటరీ) డైరెక్టర్ విజయగౌరీ సూచించారు. కేసముద్రం రైతు వేదికలో ఆ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులు జిల్లాలోని ఏఈవోలకు నిర్వహించే శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. స్థానిక ఏంఏవో బి.వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో విజయగౌరీ మాట్లాడుతూ వివిధ పంటల సాగులో భూమి, నీరు సంరక్షణకు ఉపయోగపడే పద్ధతులకే ప్రాధాన్యతనిచ్చి వాటిని రైతులు అమలు పర్చేలా చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని శిక్షణలో పాల్గొన్న 82 మంది విస్తరణాధికారులకు ధ్రువీకరణ పత్రాలను, భూమి, నీటి సంరక్షణ పద్ధతులపై పుస్తకాన్ని నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, డీహెచ్ఎస్‌వో మరియన్న, మానుకోట ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు, సంస్థ ఏడీఏ కె.సునీత, కేవీకే శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్, ఏవోలు ఎస్.అన్నపూర్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్

వెంకటాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రాంచందర్ పిలుపునిచ్చారు. మండలంలోని కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆవరణలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ఆదివాసీలకు చేసే మోసాన్ని తెలుసుకోవాలన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాలను పాలక ప్రభుత్వాలు అమలు చేయకుండా నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు ఆదివాసీ చట్టాలు, హక్కులను పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పూనెం మునేశ్వర్‌రావు, తాటి లక్ష్మణ్, చింత సోమరాజు, తాటి నర్సింహారావు, మల్లయ్య, గణేష్, సందీప్, ఉషారాణి, స్వరూ ప, రాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా సుగుణ



కాటారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా కాటారం మాజీ జడ్పీటీసీ ఆంగోత్ సుగుణ నియమితులయ్యారు. ఏఐసీసీ మహిళా అధ్యక్షురాలు అల్కా లాంబా, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఏఐసీసీ మహిళా అధ్యక్షురాలు అల్కా లాంబా, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావుకు సుగుణ కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నియామకంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2560	2045
పల్లికాయ (సూక)	6610	5600
పల్లికాయ (పచ్చిది)	4750	4500
కందులు	7186	5560
పెసళ్లు	7013	4000
పత్తి	7165	5800
పసుపు (కాడి)	11506	10235
పసుపు (గోల)	11609	10432
తేజ మిర్చి	14900	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	14000	13000
వండర్‌హాట్ ఏసీ	13500	13000
యూఎస్341ఏసీ	14000	11000
యూఎస్341	14000	12500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పాణిని హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు సైబర్‌క్రైమ్ జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... సైబర్ నేరస్తులు ఇటీవల కాలంలో వివిధ రూపాల్లో అధికారుల మాదిరిగానే ఫోన్‌లు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు.

సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై విజయ్‌కుమార్, సైబర్‌క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి వెంట నడుద్దాం

- ఎస్సీ వర్గీకరణ సాధించుకుందాం
- మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి

విలేకరులతో మాట్లాడుతున్న రవి



మహబూబాబాద్ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి వెంట నడుస్తూ.. ఎస్సీ వర్గీకరణను సాధించుకుందామని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కావాలని డిమాండ్‌తో 11 సంవత్సరాలుగా విద్యార్థులు, యువకులు, మేధావులతో కలిసి మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం నడుస్తుందని చెప్పారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు న్యాయం చేస్తానని ప్రధాని మోదీ 2024 పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మాదిగల ఓట్లు దండుకోవడానికి బూటకపు హామీ ఇచ్చి పార్లమెంట్‌లో చట్టం చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్‌తో 2 ఫిబ్రవరి 2025న మాదిగ సంఘాల జేఏసీ, విద్యార్థి, యువజన సంఘం ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థి యువగర్జన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానుకోట జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో మాదిగ జేఏసీ నాయకులు మొలకల నరేష్, దర్శనం రామకృష్ణ, ఇనుగుర్తి సుధాకర్, పోలెపాక వెంకన్న, కంపాటి ఉప్పలయ్య, హెచ్. నాగరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.



WANTED TELECALLERS
★ Urgnet Requirement for ICIC, HDFC, AXIS, INDUSIND BANKS. DSA Personal Loans Experience and fresher female Tele-Callers Salary+Incentives Job Location Hanamkonda. Contact : +91 9398286149
AJW-7635

సెక్యూరిటి గార్డ్స్ కావలెను
★ Hunter Road, Hnk, Wgl నందు గల Show Rooms Apartments నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. జీతం : 10,000/-, 15,000/- + ESI, EPF. సంప్ర: 8978459111
AJW-462

WANTED
★ వెంటనే కావలెను మొబైల్ టెక్నీషియన్స్/ సేల్స్ పర్సన్స్ (M/F 30 Years Below) with/ without Exp. Cont : Teja Mobile Stores, Opp. B.Ed College, Hnk : 7673946689.
AJW-226352

సెక్యూరిటి గార్డ్స్ & సూపర్ వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్ లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, అర్జెంటుగా కావలెను. జీతం :12,000/-, 14,000/- 12గం., 8గం. కలవు. సంప్ర: 9000463426,
AJW-226351

WANTED
★ యూట్యూబ్ చానల్ నందు పని చేయుటకు 20 మంది (Female's) కావలెను. సుబేదారి, హన్మకొండ. సంప్ర: 8897361521
AJW-226008

HOUSE FOR SALE
★ ఖిల్లా వరంగల్ పడమర కోట పద్మశాలి వీధిలో 627 చ.గ.లలో అన్ని సౌకర్యాలతో (అటాచ్ బాత్‌రూమ్స్) నిర్మించిన N/E ఫేసింగ్ 5 పోర్షన్ల రేకుల షెడ్డు ఇల్లు అమ్మబడును. సంప్ర: 9246879943.
AJW-226408

HOUSE FOR SALE
★ వరంగల్ మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq.Yrds పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మబడును. సంప్ర: 8331888842
AJW-226410

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

గొంతెమ్మ గుట్ట.. ప్రకృతి అందాల పుట్ట

ఓవైపు ఆధ్యాత్మికం, మరోవైపు రమణీయత

కనువిందు చేస్తున్న శివలింగం, శ్రీకృష్ణుడి పాదాలు



గుట్టపై పెద్ద రాయి కింద నిర్మించిన ఆలయం



గుట్టపై ఉన్న గుడిలో శివ లింగం



గుట్టపై ఉన్న శ్రీకృష్ణుడి పాదాలు

- సజీవ సాక్ష్యాలుగా కాకతీయుల కాలం నాటి ఆనవాళ్లు
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు

చరిత్ర

కాటారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ప్రకృతి రమణీయత ఉట్టిపడే పచ్చని అడవులు, గలగల పారే సెలయేళ్లు.. మరో వైపు ఆధ్యాత్మికతకు మారుపేరుగా నిలిచిన శతాబ్దాల నాటి శివలింగం, శ్రీకృష్ణుడి పాదాలు. ఇంకో వైపు కాకతీయుల కా లం నాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా పలు నిర్మాణాలు..వెరసి పచ్చని అడవుల్లో మంత్ర ముగ్ధులను చేసే ప్రకృతి సోయగాలతో అబ్బురపరుస్తున్న గొంతెమ్మ గుట్ట అందాలు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ప్రతాపగిరి అడవుల్లో నెలకొన్న చారిత్రక, ఆధ్యాత్మిక ఆనవాళ్లు. ద్వాపరయుగంలో కుంతీదేవి వరాలు పొందడానికి గుట్టపై శివుని కోసం తపస్సు చేసినట్లు, అంతే కాకుండా శ్రీకృష్ణుడు, సుభద్రలు కుంతీదేవిని ఇక్కడే కలిసి ఆమెతో పాటు చాలా రోజులు నివాసం ఉన్నట్లు ప్రతీతి.. దీంతోనే కుంతీదేవి గుట్ట కాస్తా కాలక్రమేణ వాడుకలో గొంతెమ్మ గుట్టగా ప్రసిద్ధి పొందినట్లు పెద్దలు చెప్తున్నారు. అంతే కాకుండా ఇప్పటికీ సరైన వర్షాలు కురవనప్పుడు చుట్టు పక్కల 10గ్రామాలకు చెందిన ప్రజలు డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, లక్ష్మీదేవర విన్యాసాలతో గుట్టపైకి వెళ్లి పూజలు చేస్తే వర్షాలు కురుస్తాయని ప్రజల నమ్మకం. అలాగే 14వ శతాబ్దంలో మొఘల్ సేనల దాడి నుంచి తప్పించుకొని వస్తూ గొంతెమ్మ గుట్టతో పాటు పక్కనే కిలోమీటర్ దూరంలో ఉన్న మరో పెద్ద గుట్టపై కాకతీయ వంశ రాజు ప్రతాపరుద్రుడు తన సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు చరిత్ర చెబుతోంది. దీనికి రుజువుగా గుట్టపై పలు నిర్మాణాలున్నాయి.

జాతీయ రహదారికి దగ్గరలోనే గొంతెమ్మ గుట్ట

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ప్రతాపగిరి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న గుట్టనే గొంతెమ్మ గుట్టగా పిలుస్తారు. 353(సీ)జాతీయ రహదారి నుంచి సుమారు 10కిలోమీటర్ల దూరంలోనే ఉంది. కాటారం నుంచి ప్రతాపగిరి వరకు 7కిలోమీటర్ల మేర తారు రోడ్డు ఉండగా 3 కిలోమీటర్లు అడవిలో బండ్ల బాట మీదుగా సాగి గుట్టపైకి చేరుకోవచ్చు. ప్రకృతి అందాల మధ్య సుమారు 250మీటర్ల ఎత్తులో గొంతెమ్మ గుట్ట ఉంది. గుట్టపైకి వెళ్లేందుకు మూడు ప్రధాన ద్వారాలున్నాయి. గుప్తనిధుల వేటగాళ్లతో గుట్టపై ఉన్న ద్వారాలు, ఇతర చారిత్రిక సంపద ధ్వంసమైనప్పటికీ.. చరిత్ర సజీవ సాక్ష్యాలుగా పలు ఆనవాళ్లు మిగిలే ఉన్నాయి.

కృష్ణుడి పాదముద్రలు నయనానందకరం

గుట్టపై పెద్ద బండ సొరికెలో అలనాటివిగా చెప్పుకొనే శ్రీకృష్ణుడి పాదముద్రలు, కుంతీ దేవి పూజించినట్టు చెప్పే ప్రాచీన శివలింగం దర్శనమిస్తాయి. కృష్ణుడి పాదాలను, శివలింగాన్ని భక్తులు నయనాందకరంగా దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. పెద్ద బండ రాయి కింద చిన్నపాటి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంపైన పద్మం ఆకారంలో రాయిని చెక్కించారు.

శత్రు దుర్భేద్యంగా పెద్ద బండలతో ప్రహరీ

గొంతెమ్మ గుట్టపై కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు రక్షణ కోసం శత్రు దుర్భేద్యమైన పెద్ద పెద్ద రాళ్లతో ప్రహరీని నిర్మింపజేశాడు. సైనిక అవసరాల కోసం గుట్టపై స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లున్నాయి. గుట్టపైకి చేరుకోవాలంటే మూడంచెల్లో ఉన్న ద్వారాలను దాటి వెళ్లాలి. సైన్యం స్నానాలు, ఇతర నీటి అవసరాల కోసం గుట్టపైనే పెద్ద కొలనును ఏర్పాటు చేశారు. గుట్ట పైనుంచి ఇతర ప్రాంతాలకు పెద్ద సొరంగమార్గం ఉంది. గుట్టపై గుప్త నిధులున్నాయనే అపోహతో పలు చోట్ల దుండగులు ధ్వంసం చేశారు. దీంతో చరిత్ర ఆనవాళ్లు కొంత మేర దెబ్బతిన్నాయి. ఓ వైపు ఆధ్యాత్మికత.. మరో వైపు ప్రకృతి రమణీయత.. ఇంకో వైపు కాకతీయుల నాటి ఆనవాళ్లు, చారిత్రక సంపద ఉన్న గొంతెమ్మ గుట్టను ప్రభుత్వం గుర్తించి పర్యాటకంగా కేంద్రంగా చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ప్రకృతి అందాల మధ్య, మనసును పులకింపజేసేలా అబ్బురపరుస్తున్న గొంతెమ్మ గుట్టను పర్యాటకంగా తీర్చిదిద్దితే చారిత్రక సంపదను పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు అందించినట్లవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

విశిష్టత కలిగిన కొలనుగుంట నీరు

గుట్టపై భక్తితో పూజించి ధ్వని చేస్తే వేసవికాలంలో కూడా కొంచెం నీటి ఊట కనిపించే కొల్లుగుంట (కొలను గుంట)గా ప్రసిద్ధి చెందిన నీటి ఊట ఉంది. పరిసర ప్రాంతాల ప్రజలు తమ పంటలకు చీడపీడలు ఆశించినప్పుడు ఎంతో విశిష్టత కలిగిన గుంటలోని నీటిని తీసుకొని వెళ్లి చీడపీడలు సోకిన పంటలపై చల్లడం ఆనవాయితీగా వస్తోంది. అంతే కాకుండా పాండవ దేవుళ్లను కొలిచే భేరి(వేదిక)ఉంది. ప్రతీ శ్రావణమాసంలో వివిధ ప్రాంతాల లక్ష్మీదేవరలు, శివసత్తులు, పాండవదేవుళ్లు గుట్టపై చేరి అక్కడే బోనాలు సమర్పించి మొక్కులు సమర్పిస్తుంటారు. నాయకపోడ్ కులస్థుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవర జాతర మూడు రోజుల పాటు ప్రతీ ఏటా పెద్దఎత్తున జరుగుతుండగా వేలాది మంది భక్తులు హాజరవుతారు. వర్షాభావ సమయంలో కాటారం మండలంతో పాటు మహదేవ్‌పూర్, మహాముత్తారం మండలాల ప్రజలు డప్పు చప్పుళ్లతో గుట్టపైకి చేరుకొని వర్షాలు సమృద్ధిగా కురవాలని గొంతెమ్మను మొక్కడం ఆనవాయితీగా వస్తోంది.



గుట్టపై భారీ రాళ్లతో నిర్మించిన గోడ



గుట్టపై కాకతీయుల కాలం నాటి ప్రహరీ



సొరంగ మార్గం



కొండపర్తి గ్రామం వ్యూ

మారనున్న కొండపర్తి రూపు

- గవర్నర్ దత్తత గ్రామంలో పలు పనులకు శ్రీకారం
- మారుమూల ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణ

మేడారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దత్తత తీసుకున్న కొండపర్తి గ్రామ రూపురేఖలు మారబోతున్నాయి. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పంచాయితీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచనల మేరకు ఈ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకున్న నేపథ్యంలో ఈ గ్రామానికి కావల్సిన మౌలిక సదుపాయాలు, ప్రజల అభివృద్ధికి కావల్సిన పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా టైలరింగ్, కుట్టు మిషన్ల పరిశ్రమ, పకృతి సిద్ధ తాత్కలిక ప్లేట్ల తయారీ, సానిటరీ ప్యాడ్స్ ప్యాకింగ్, పప్పు దినుసులు మసాలాల ప్యాకింగ్, మార్కెటింగ్ స్కిల్ డెవలప్ మెంట్ వంటి పరిశ్రమల ఏర్పాటు లాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ గ్రామంలో మొత్తం 300మంది ఆదివాసీలు జీవిస్తుండగా.. చదువుకున్న యువతీ, యువకులు 50 మంది ఉన్నారు. వారంతా నిరుద్యోగులు కావడంతో ఈ గ్రామాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. అభివృద్ధిలో భాగంగా గ్రామంలో రెండు భారీ షెడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామంలో చీకట్లను తొలగించేలా సొలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గ్రామంలోని ప్రతి కుటుంబానికి 79 పక్కాఇళ్లు నిర్మించనున్నట్లు అధికారులు తెలుపారు. కలెక్టర్ దివాకర పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతుండగా.. ఆయన గురువారం గ్రామంలో పర్యటించి పనుల పురోగతిని తెలుసుకోనున్నారు. అయితే మండలంలోని మారుమూల గ్రామమైన కొండపర్తి గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకోవడం సంతోషంగా ఉందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మంత్రి సీతక్క చొరవతో వందల ఏళ్ల తరువాత ఆదివాసీల అభివృద్ధి జరుగుతోందన్నారు.



కొండపర్తి గ్రామంలో షెడ్ నిర్మాణాలు

గవర్నర్, సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు :

అరెం లచ్చుపటేల్



ఏజెన్సీ మండలమైన తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామాన్ని ఎన్నుకొని అభివృద్ధి చేస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్కకు మేడారం దేవాదాయ మాజీచైర్మన్ అరెం లచ్చుపటేల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజల జీవితాల్లో కష్టనష్టాలను తొలగించే ప్రయత్నం అభినందనీయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కోర్కెలు తీర్చే.. కోర మీసాలస్వామి

- బ్రహ్మోత్సవాలకు కొత్తకొండ ఆలయం ముస్తాబు
- రేపు వీరభద్రస్వామి కల్యాణం
- హాజరు కానున్న మంత్రి పొన్నం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఆధ్యాత్మికం

భీమదేవరపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారమైన కొత్తకొండ వీరన్న జాతరకు వీరభద్రస్వామి ఆలయం ముస్తాబైంది. కొత్తకొండ వీరన్న జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలను సమర్పిస్తూ స్వామి వారి కృపకు భక్తులు పాత్రులవుతారు. భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించేందుకు నెల రోజులుగా అధికారులు పనులు మొదలు పెట్టారు. భక్తులకు ఎక్కడా లోటు పాట్లు కలుగకుండా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆలయ ఈవో కిషన్ రావు యుద్ధ ప్రాతిపదికన పనులను చేయిస్తున్నారు. వైద్యం, మంచినీటి సౌకర్యం, ఆర్టీసీ, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పా ట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులందరి సమష్టి కృషితో జాతరను విజయవంతం చేయాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని అంచనా వేస్తూ చలువ పందిళ్లు, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి.





కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వామి వారి కల్యాణంతో శుక్రవారం ప్రారంభమవుతాయి. 11న త్రిశూలార్చన, 12న లక్ష బిల్వార్చన, 13న భోగి పండుగ, 14న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బండ్లు తిరుగుట, 15న కనుమ ఉత్స వం, 16న నాగవల్లి, పుష్పయాగం, 17న త్రిశూల స్నానం, 18న అగ్ని గుండాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. వీరభద్రస్వామి దేవాలయం ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటి గా విలసిల్లుతుంది. ఈ ఆలయం శిల్పాలు, విశాల ఆలయ ప్రాంగణంలో ప్రాకార మండపంతో రాజగోపురాలతో అలరాలుతూ ఈశాన్య భాగంలో పుష్కరిణి విశేషంగా ఆకర్షిస్తూ కొండపై భాగంలో సప్త కోనేరులతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిస్తుంది.

అభివృద్ధి పనులు

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో వివిధ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ జ్ఞాపకార్థం రూ.40 లక్షల వ్యయంతో ధ్యాన మందిరం నిర్మించారు. ప్రస్తుతం ఇదే ధ్యాన మందిరంలో స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్తకొండ కొండపైకి కాలి నడకన వెళ్లేందుకు రహదారి నిర్మాణం జరుగుతోంది. ఇందుకోసం మంత్రి పొన్నం ప్రభాకర్ మొదటి విడతగా రూ.10లక్షల నిధులను కేటాయించారు. పనులు చురుగ్గా సాగుతున్నాయి. దేవాలయం గర్భగుడిలో వీరభద్రస్వామికి ఇత్తడి తాపడం పూర్తి చేశారు. దీంతో ఆలయం గర్భగుడి శోభయామనంగా భక్తులకు వీరభద్రుడు దర్శనమిస్తున్నాడు. ఏసీ కల్యాణ మండపం పూర్తయింది. ఆలయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం దేవాదాయ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

రేపు సాయంత్రం కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన వీరభద్రస్వామి కల్యాణం శుక్రవారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణం సందర్భంగా గణపతిపూజ, శైవశుద్ధి, పంచగవ్య పాశన, ధ్వజారోహణం, భేరిపూజ నిర్వహిస్తారు. స్వామి వారికి పట్టువస్త్రాలను మంత్రి పొన్నం ప్రభా కర్ సమర్పిస్తారు. అలాగే ముత్యాల తలంబ్రాలను సైతం కల్యాణంలో అందిస్తారు. ఇప్పటికే కల్యాణం జరిగే కల్యాణ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు.

జాతరకు విస్తృత ఏర్పాట్లు



కొత్తకొండ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం సకల సౌకర్యాలు కల్పించాం. ఈ సారి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేసి అందుకు తగ్గట్లు ఏర్పాట్లు పూర్తి చేశాం. వైద్యం, మంచి నీటి సౌకర్యం కల్పించాం. భక్తుల రద్దీకి తగ్గట్టుగా బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశాం. కరీంనగర్, హనుమకొండ, వరంగల్, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోల నుంచి భక్తులను తీసుకువచ్చేందుకు ఆర్టీసీ బస్సులు నడుపిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

- కిషన్‌రావు, ఆలయ ఈవో, కొత్తకొండ

40 ఇయర్స్.. ఇండస్ట్రీ

కళ

- టెన్త్‌లోనే మద్రాస్ రైలెక్కిన శ్యామల గణేష్
- సహాయ నటుడిగా 1986లో తెరంగ్రేటం
- 'ఆహుతి'కి గాను దాసరి చేతులమీదుగా అవార్డు
- 1990లో 'డాక్టర్ భవానీ'తో నిర్మాతగా అడుగులు
- త్వరలో విడుదలకు సిద్ధంగా రెండు సినిమాలు

వరంగల్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆయనకు సినిమాలంటే అమితమైన ఇష్టం. ఎలాగైనా నటుడిని కావాలన్న తపనతో 50ఏళ్ల క్రితం మద్రాసు రైలెక్కారు. తొలిరోజుల్లో నిరాశే ఎదురైనా.. పట్టు వీడలేదు. ఆ తర్వాత హైదరాబాద్ బాట పట్టి.. అనేక ఇబ్బందులను తట్టుకుని.. ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డారు. వచ్చిన అవకాశాలను మెట్లుగా మలుచుకుని నటుడిగా, నిర్మాతగా, హీరోగా ఎదిగారు. కళలకు కళాకారులకు నిలయమైన ఓరుగల్లు కీర్తి కిరీటంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. సినీ రంగంలో రాణించాలంటే ఎంత కష్టపడాలో తెలిసిన వ్యక్తిగా.. తన వద్దకు వచ్చిన వారిలో ఎంతోమందికి సినిమాల్లో అవకాశాలు కల్పించారు. ఆయనే శ్యామల గణేష్. హనుమకొండ నయీంనగర్ ప్రాంతంలో పుట్టిపెరిగి.. సుమారు 40ఏళ్లు సినీ రంగంలో రాణించిన ఆయన ప్రస్తుతం వరంగల్‌లో నివాసం ఉంటున్నారు.

త్యాగరాజును చూసి..

1970వ దశకంలో తన ఇంటిపక్కన ఉండే త్యాగరాజు అనే సినీ కళాకారుడు ఉండేవారని, ఆయన హనుమకొండకు వచ్చినప్పుడు ఆయన్ను చూసేందుకు చాలామంది వచ్చేవారని, ఆయన్ను చూసి తనకు కూడా సినిమా ఆర్టిస్టును కావాలనే కుతూహలం మొదలైందన్నారు. అలా తాను 10వ తరగతిలో ఉన్నప్పుడు హీరో కృష్ణ నటించిన మోసగాళ్లకు మోసగాడు విడుదలైందని, అందులో త్యాగరాజు కూడా ఉన్నాడని, దాంతో ఆ సినిమాను వంద సార్లు చూశాని గుర్తు చేసుకున్నారు. ఇక పదో తరగతి పూర్తయ్యాక ఎలాగైనా సినిమాల్లో నటించాలన్న ఆసక్తితో 1976లో మద్రాస్ రైలెక్కి త్యాగరాజు ఇంటికి వెళ్లానని,

కానీ ఇక్కడ ఏం పనిలేదు వెళ్లిపొమ్మని తనను పంపించాడని, చేసేది లేక ఇంటికి తిరిగి వచ్చానన్నారు. ఈ క్రమంలో ఓ మిత్రుడి సలహా మేరకు హైదరాబాద్ వెళ్లి.. రాజకీయ నాయకుడు పి.జనార్ధన్‌రెడ్డికి దగ్గరి బంధువైన నా మిత్రుడిని కలిశానన్నారు. అయితే 1980లో కోడి రామకృష్ణ దర్శకత్వంలో తీసిన ఉదయం సినిమా కొన్ని కారణాలతో విడుదల కాలేదని, ఆ సినిమా విడుదల చేయిస్తే తనకు సినిమాల్లో అవకాశం వస్తుందన్న ఆశతో వాళ్లందరినీ హనుమకొండకు తీసుకువచ్చి అప్పటి ఎమ్మెల్యే హయగ్రీవాచారితో కల్పించి ఆ సినిమా విడుదలకు మార్గం సుగమం చేశానన్నారు. ఆ ఘటన తర్వాత తనకు సినిమా వాళ్లతో మంచి పరిచయాలు ఏర్పడ్డాయని, 1986లో తొలిసారి హిందీ సినిమాలో అవకాశం కూడా వచ్చిందన్నారు.

తేరా కరమ్, మేరా తరమ్ అనే సినిమాలో హీరో ధర్మేంద్రతో కలిసి మూడు సీన్లలో నటించానని అవన్నీ తనకు మధురానుభూతులుగా మిగిలాయన్నారు. 1887లో తెలుగు సినిమా విషజ్వాలలో నటించగా మంచి క్యారెక్టర్ కావడంతో గుర్తింపు వచ్చిందని, అదే ఏడాది 'ఈ ప్రశ్నకు బదులేది' 'జైలుపక్షి' 'యుగకర్తలు' 'ఆహుతి' సినిమాల్లో నటించానని, ఆహుతి వందరోజుల ఫంక్షన్‌లో దాసరి నారాయణరావు చేతులమీదుగా జ్ఞాపిక అందుకున్నానని గుర్తుచేసుకున్నారు.

నిర్మాతగా..

నటనలో రాణిస్తూనే గణేష్ నిర్మాతగా కూడా మారారు. 1990లో భానుచందర్, శారద, వాణివిశ్వనాథ్, రాజేష్, జగ్గయ్య, పరుచూరి గోపాలకృష్ణతో కలిసి 'డాక్టర్ భవానీ' సినిమా తీయగా అది సూపర్‌హిట్ అయ్యింది. ఆ తరువాత 'ప్రేమించొద్దు ప్రేమించొద్దు' 'దేశద్రోహులు' సినిమాలకు సహ నిర్మాతగా వ్యవహరించారు. ఆ సమయంలో హీరోలు, నిర్మాతలు, దర్శకులతో మంచి పరిచయాలు ఏర్పడుతుండగా.. విధి వక్రించింది. కుటుంబంల వచ్చిన సమస్యలకు తండ్రి మరణంతో ఆయన కొన్నాళ్లు వరంగల్‌కే పరిమితమవ్వాల్సింది.



మిస్టర్ రౌడీ చిత్రంలో హీరో సుమన్‌తో ఓ సన్నివేశంలో గణేష్ (ఫైల్)

హీరోగా.. విలన్‌గా..


వరంగల్ మిత్రులతో కలిసి గణేష్ నిర్మాతగా 'స్పాట్' సినిమా తీశారు. అది పూర్తిగా వరంగల్ పరిసర ప్రాతంలోనే చిత్రీకరించారు. అందులో ఆయన విలన్ పాత్ర పోషించారు. అనంతరం హీరో, నిర్మాతగా మిస్టర్ రౌడీ సినిమా రూపొందించారు. ఇటీవల కాలంలో నిర్మాతగా, విలన్‌గా ఆత్మకూర్ గడీ, జ్వాలా సేతు సినిమాలు చేశారు. అవి రెండూ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అంతేగాకుండా మరో కొత్త సినిమాకు కూడా రంగం సిద్ధం చేస్తున్న ఆయన ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వాస్తవికతతో కూడిన కథను తయారు చేసుకుంటున్నానని తెలిపారు. తన కొత్త సినిమాను కూడా ఉమ్మడి వరంగల్ పరసర ప్రాంతంలోనే చిత్రీకరించేందుకు సిద్ధమవుతున్నానని, ఇక ఆ సినిమా టైటిల్‌ను 'రోకలిబండ' అని పెట్టామని, ఇందులో ఉమ్మడి వరంగల్‌కు చెందినవారినే నటీనటులుగా తీసుకోవాలనే ఆలోచనతో ఉన్నానన్నారు. అయితే తన నలభైఏళ్ల సినీ ప్రస్థానంలో ఇప్పటివరకు దాదాపు వంద మందిని ఇండస్ట్రీకి పరిచయం చేశానని చెప్పుకొచ్చారు.



దేశద్రోహులు షూటింగ్‌లో హాస్య నటుడు అలీ, హీరో భానుచందర్, హీరోయిన్లు ప్రియరామన్, శ్వేతామీనన్, శరత్‌బాబులతో గణేష్ (ఫైల్)

వరంగల్‌లో స్టూడియో ఏర్పాటు చేయాలి

శ్యామల గణేష్



ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేలాది మంది నాటక, టీవీ, సినీ కళాకారులున్నారు. సినిమాలు షూటింగ్ చేసేందుకు అందమైన, అనువైన లొకేషన్లున్నాయి. వరంగల్‌లో తక్కువ బడ్జెట్‌తో సినిమాలు తీసుకునేందుకు వీలుగా ఒక స్టూడియో నిర్మించాల్సిన అవసరం ఉంది. దాని కోసం ప్రయత్నం చేస్తున్నాం. ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి స్థలం కేటాయించాలని కోరాం. ఈలోగా వరం గల్ కళాకారులను ఒక వేదిక మీదకు తీసుకువచ్చి త్వరలోనే వ రం గల్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం.

హనుమకొండ జడ్పీలో శాయంపేట మండలం విలీనం

- అధికారికంగా ఉత్తర్వులు జారీ
- హనుమకొండ జడ్పీసీఈవో విద్యాలత

శాయంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనలో భాగంగా వరంగల్ రూరల్ జడ్పీలో ఉన్న శాయంపేట మండలం హనుమకొండ జడ్పీ పరిధిలో చేర్చారని ఈ మేరకు ఇటీవల అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయని హనుమకొండ జడ్పీసీఈవో విద్యాలత వెల్లడించారు. బుధవారం జడ్పీసీఈవో ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గతంలో శాయంపేట మండలం హనుమకొండ జిల్లాలో ఉండి, జడ్పీ వరంగల్ పరిధిలో ఉండేదని తెలిపారు. ఈ నేపథ్యంలో మండలాన్ని మొదటిసారి సందర్శించడం జరిగిందని తెలిపారు. అలాగే మండలంలోని మాందారిపేట గ్రామాన్ని సందర్శించారు.

ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అలాగే నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరచూ తనిఖీలు చేయడం జరుగుతుందని, విధులలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, ఏపీవో అనిత, పంచాయతీ కార్యదర్శి అజయ్, ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న విద్యాలత

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ములుగు

గురువారం 9 జనవరి 2025



ములుగు మండలం బండారుపల్లి జీపీలో పోలింగ్ సామగ్రి

సమరానికి సిద్ధం!

సర్పంచ్ ఎన్నికలకు ముమ్మరంగా ముందస్తు ఏర్పాట్లు

- మూడు దశల్లో ఎన్నికలు జరిగే అవకాశం
- పుష్కరం తర్వాత మంగపేట మండలంలో..
- బ్యాలెట్ బాక్సులు, పేపర్లను సిద్ధం చేస్తున్న అధికారులు
- ములుగు జిల్లాలో 191కి పెరుగుతున్న పంచాయతీలు
- కొత్తగా ఏర్పాటయ్యేవి 21

ములుగు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సమరానికి సమయం ఆసన్నమైంది. సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం ముం దస్తు ఏర్పాట్లు చేస్తోంది. జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందనే ఊహాగా నాల నేప థ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మూడు దశల్లో ఎన్నికలు

ప్రస్తుతం ములుగు జిల్లాలో 174 పంచాయతీలు, 1,556 వార్డులు ఉన్నాయి. సర్పంచ్‌లు లేక ఏడాది కావస్తోంది. గత సంవత్సరం ఫిబ్రవరి 2తో పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేకా ధికారుల పాలన సాగుతోంది. త్వరలో జరిగే ఎన్నికలను జిల్లాలో మూడు దశల్లో నిర్వహించాలని యంత్రాంగం సూత్రప్రాయంగా నిర్ణయించింది. జిల్లాలో మొత్తం తొమ్మిది మండలాలు ఉండగా ఒక్కో దశలో మూడు మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి.

21 కొత్త పంచాయతీలు

ములుగు జిల్లాలో కొత్తగా 21 పంచాయతీలు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్ర మంత్రి సీతక్క సూచన మేరకు కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 200 నూతన పంచాయతీలకు సర్కారు అంగీకారం తెలిపింది. జిల్లాలో ప్రస్తుతం 174 పంచాయతీలు ఉండగా ములుగు, బండారుపల్లి, జాకారం, జీవంతరావుపల్లి పంచాయతీలు కలిపి మునిసిపాలిటీగా ఏర్పాటవుతోంది. నాలుగు పంచాయతీలు తగ్గి.. కొత్తగా ఏర్పాటయ్యే 21 జీపీను కలుపుకుంటే సంఖ్య 191కి పెరగనుంది. ములుగు మండలంలో చిన్నగుంటూరుపల్లి, శ్రీరాములపల్లి, జగ్గన్నగూడెం, చింతకుంట, గోవిందరావుపేట మండలంలో మొద్దుల గూడెం, తాడ్వాయి మండలంలో కొండపర్తి, బిట్టుపల్లి(కొడిశాల), పడిగాపూర్, ఏటూరునాగారం మండలంలో బూటారం, గోగుపల్లి, కన్నాయి గూడెం మండలంలో చిట్యాల, భూపతిపూర్, కన్నాయిగూడెం, సింగారం, మంగపేట మండలంలో తొండ్యాల లక్ష్మీపూర్, నరేందర్‌రావుపేట, శనిగకుంట, జబ్బోనిగూడెం, అబ్బాయిగూడెం, వాజేడు మండలంలో అరుణాచలపురం, వెంకటాపురం మండలం కొత్త కొండాపురం గ్రామపంచాయతీలుగా ఆవిర్భవించనున్నాయి.

12 ఏళ్ల తర్వాత మంగపేటలో ఎన్నికలు

షెడ్యూల్డ్, నాన్‌షెడ్యూల్డ్ వివాదంతో 2013 నుంచి స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉన్న మంగపేట మండలంలో ఎట్టకేలకు ఈసారి ఎన్నికలు జరగనున్నాయి. మండలంలోని 25పంచాయతీలతోపాటు అన్ని ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేయాలని ఆదివాసీలు కోర్టును ఆశ్రయించడం, దీనిని సవాల్ చేస్తూ గిరిజనే తరులూ కోర్టుకెక్కడంతో ఎన్నికలు వాయిదాపడుతూ వస్తున్నాయి. 2019జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కాగా పోలింగ్‌కు ముందే



సిద్ధంగా బ్యాలెట్ బాక్సులు

ఒక పంచాయతీ, 50వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మరొక్కరోజులో ఎన్నిక జరగాల్సి ఉండగా హైకోర్టు స్టే విధించడంతో నిలిచిపోయాయి. ఈనేప థ్యంలో గతేడాది జూలైలో రాష్ట్ర హైకోర్టు గిరిజనులకు అనుకూలంగా మంగపేట మండలాన్ని 5వ షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించాలని తీర్పు నిచ్చింది. దీంతో ఈసారి సర్పంచ్ ఎన్నికలకు మార్గం సుగమం అయ్యింది.

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం



పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం సిద్ధంగా ఉన్నాం. ఉన్నతా ధికారుల ఆదేశాలతో ఏర్పాట్లు చేసుకుంటున్నాం. బ్యాలెట్ పేపర్లు, బాక్సులను సమకూర్చుకుంటున్నాం. కొత్తగా 21పంచాయతీల కోసం పంపిన ప్రతిపాదనల సంబంధించి ఆమోదం రావాల్సి ఉంది. గెజిట్ వచ్చిన వెంటనే ఓటరు లిస్టు, వార్డుల విభజన జరుపుతాం.

- ఒంటేరు దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి

ముమ్మరంగా ఏర్పాట్లు

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. సామగ్రిని ఇప్పటి నుంచే సమీకరించుకుంటోంది. ఒక్కో వార్డుకు ఒక్కో బ్యాలెట్ బాక్సును ఏర్పాటు చేయనున్నారు. బాక్సులను రిపేరు చేయించిన అధికారులు ములుగు ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరిచారు. సర్పంచ్‌కు గులాబీ, వా ర్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలె ట్ పేపర్‌లను ఉపయోగిం చను న్నారు. పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో కామన్ గుర్తులను కేటా యిస్తారు. హనుమకొండలోని ఓ ప్రింటింగ్ ప్రెస్ తో ఒప్పందం చేసు కున్న జిల్లా అధికారులు బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్‌కు ఆర్డర్ ఇచ్చారు.

ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వాజేడు, జనవరి 8: ప్రజలకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా నష్టపోయిన నలుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అదే విధంగా గుట్టలపై ఉన్న పెనుగోలు గిరిజనులు గుమ్మడిదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఇందిరమ్మ సర్వేను చేయించి ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఇటీవ మృతిచెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, చింతూరు జీపీ మాజీ సర్పంచ్ చింత సమ్మయ్య దశదిన కర్మలకు ఎమ్మెల్యే హాజరయయ్యారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకుడు విశ్వనాథ ప్రసాదబాబు రాజు, మాజీ జడ్పీటీసీ తల్లడి పుష్పలత, నాయకులు తల్లడి ఆదినారాయణ, వత్సవాయి జగన్నాథరాజు, దాట్ల వాసు, చెన్నం ఎల్లయ్య, రాంబాబు, ఖాజావలీ తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ దివాకర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రవాణాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రోడ్డుభద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో రోడ్డుభద్రత నియమాలపై అవగాహ కల్పించడం, పాఠశాలలు, కళాశాలల్లో చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించడం, వాహన డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శనలు, ప్రచారయాత్రలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి డి.శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, ఎంవీఐ వినోద్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ చట్టాన్ని అమలు చేస్తాం : ఆర్డీవో

ములుగు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యతను పిల్లలు చూసుకోని పక్షంలో స్థిరాస్తి తల్లిదండ్రులకు అప్పగించి సీనియర్ పౌరుల పోషణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని స్థానిక ఆర్డీవో వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారసత్వ ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్న వారిపై 1977 చట్టాన్ని అమలుచేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గతనెల 2న ములుగు గ్రామానికి చెందిన ఇమ్మడి లక్ష్మి, భర్త సమ్మయ్య కలిసి తమ కుమారుడు ఇమ్మడి నాగరాజు, కోడలు పద్మ డెకరాల 28 గుంటల భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని తమ పోషణను పట్టించుకోకపో వడంతో పాటు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 సెక్షన్ 5 (1) కింద కేసు నమోదు అయ్యిందని, ఇరుపక్షాల వారిని విచారణ జరపగా ఆస్తి తీసుకున్న విషయంతోపాటు తల్లిదండ్రుల పోషణ చూడడంలేదని తేలిందని తెలిపారు. ఈసందర్భంగా నాగరాజు, ఆయన భార్య పద్మ కలిసి సమ్మయ్య కుటుంబానికి జీవనభృతి కోసం ప్రతినెలా రూ.6వేలు చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా అంగీకరించారని పేర్కొన్నారు.

మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

ములుగు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన రేణుకుంట్ల దేవక్క ఇటీవల అనారోగ్యంతో మరణించగా బుధవారం వెంకటసాయి రైస్‌మిల్లు యజమాని, ములుగు జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పల్లెపాటి సమ్మిరెడ్డి బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లు సూపర్‌వైజర్ మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

గోవిందరావుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పస్రా ఎస్సై కమలాకర్ సూచించారు. రోడ్డు భద్ర త మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలకేంద్రంలో ఆయ న వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మె ట్ తప్పకుండా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరా దని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, కార్లు నడిపే వారు సీట్‌బెల్టు ధరించాలని, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపరాదని సూ చించారు. నియమాలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు

ములుగు కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశం కోసం జిల్లాలోని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్లమాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని పేర్కొన్నారు. గురుకులాల్లో విద్యనభ్యసించే విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://టీజీసీఇటీ.సీజీజీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేముందు కుల ధ్రువీకరణ పత్రం నంబర్, ఆదాయ ధ్రువీకరణపత్రం నంబర్, ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికెట్, ఫొటో అవసరమని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

కాటారం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిద్నెపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పోలీసులు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుళ్లు లక్ష్మిరాజు, రఘు, నాగరాజు గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియన వ్యక్తులు చెప్పే మాటలు నమ్మవద్దని, ఫోన్లలో వచ్చే అన్ని సందేశాలను ఆచరించవద్దని, ఓటీపీలు ఎవరడగినా చెప్పొద్దన్నారు. సైబర్ నేరాలు జరిగినట్లయితే వెంటనే 1930నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు చెప్పి ఫిర్యాదు చేయాలన్నారు. డబ్బుల విషయమై తెలియని వ్యక్తులను ఆశ్రయించొద్దన్నారు.

- మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై బి.అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం మండలంలోని కొరికిశాల మోడల్‌స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు ఎస్సై అన్నదానం

కాటారం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులకు కాటారం ఎస్సై మ్యాక అభినవ్-రవళిక దంపతులు బుధవారం అన్నదానం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అయ్యప్ప మాలధారులతో కలిసి స్వామివారికి అన్నప్రసాదాలు నైవేద్యంగా సమర్పించి వారితో కలిసి భోజనాలు చేశారు. మాలధారణతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని, అందరు కలిసిమెలసి జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు బచ్చు అశోక్, ప్రకాష్, రామకృష్ణారావు, జక్కు, మొగిలి, చీమల రాజు, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, వెంకన్న, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

చిట్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచినిపర్తి గ్రామ బీఆర్ఎస్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. గ్రామశాఖ అధ్యక్షుడిగా ఇంగిలి నిర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా దామెర సాంబయ్య, ఉపాధ్యక్షులుగా కంకల రాయకొంరు, గోగుల రాంరెడ్డి, కోశాధికారిగా అబ్బు సాంబరెడ్డి, కార్యదర్శిగా కొంకుల రవి, యూత్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా అన్నారపు రమణకుమార్, కొంగొండ కార్తిక్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, నాయకులు పిట్ట సురేష్, తౌటం నవీన్, రాజేందర్, రమేష్, దామెర రాజు, సదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో జాప్యంపై నిరసన

మహాముత్తారం, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ మండలంలోని యామన్‌పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం రాత్రి డప్పుకొడుతూ నిరసన వ్యక్తం చేశారు. మంద కృష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఫిబ్రవరి 7లోగా వర్గీకరణను అమలు చేయకపోతే ఆదే వేయి గొంతులు లక్ష డప్పుల మహా ప్రదర్శన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, కళాకారులుతో పాటు నాయకులు మారపాక లచ్చయ్య, బాపన్న, భిక్షపతి, సీసన్న, పంగ రాజయ్య, పులియాల రాజయ్యపంగ చందు, మంద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రచనలతోనే సామాజిక చైతన్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పుస్తక ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రచనలతోనే సామాజిక చైతన్యం వస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. స్థానిక ఇల్లందుక్లబ్‌హౌస్‌లో ఏసీజీ మండల రవీందర్‌రెడ్డి అధ్యక్షత బుధవారం నిర్వహించిన శ్రీ మహా సరస్వతీ శతక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సారస్వత సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య రచించిన శ్రీమహా సరస్వతీ పుస్తకం ఎంతో మందిని ప్రభావితం చేస్తుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో జరుగుతున్న మార్పులు, అభివృద్ధిపై రచనలు చేయాలని అన్నారు. ఇలాంటి రచనలు సమా జానికి ఎంతో మేలు చేస్తాయని లక్ష్మయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో కవులను శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్ర మానికి విశిష్ట అతిథిగా డీఈవో ముద్దమల్ల రాజేందర్ హాజరయ్యారు. కవులు, కళాకారులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

జాంబవ కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జాంబవ కుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాంబవ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మచ్చ భద్రయ్య, కార్యదర్శి కోడెపాక శంకర్, ఉపాధ్యక్షుడు కలువల రాజమౌళి, సలహాదారులు శంకర్, కోశాధికారి పులియాల తిరుపతి, నాయకులు రమేష్, విష్ణు, సుధాకర్, శంకర్, శ్రీను, మధు, ఐలయ్య పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు భూములు గుర్తించాలి : భూపాలపల్లి కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు భూములు గుర్తించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యుత్, రెవెన్యూ, డీఆర్డీఏ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఈనెల 20 వరకు నివేదిక ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో ఈనెల 17 వరకు నివేదిక పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్, డీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

భూపరిపాలనలో నూతన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం

భూపరిపాలనలో మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ తెలంగాణ భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు, భూయజమానుల హక్కుల రక్షణ, భద్రతతో పాటు పలు రకాల సహాయసహకారాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి బిల్లును అమల్లోకి తెనున్నట్లు తెలిపారు. రైతులకు ఏదైనా భూసమస్య ఎదురైతే పైసాఖర్చులేకుండా ఉచితసలహాలు పొందేందుకు వీలు కల్పించారన్నారు. కోర్టుల చుట్టు తిరుగకుండా జిల్లాస్థాయిలోనే రెండు అప్పీళ్ల వ్యవస్థలు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్, డిఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ట్రక్ డ్రైవర్ మృతి

(5వ పేజీ తరువాయి)

భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన అన్వర్ మృతి చెందడంతో గణపురంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని తోటి డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకొనేలా చొరవచూపాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసి విజ్ఞప్తి చేశారు. అన్వర్ మృతికి సంతాప సూచికంగా బుధవారం ఉదయం షిఫ్టులో స్థానిక ప్రభావిత ప్రాంతాల డ్రైవర్లు గైర్హాజరయ్యారు.

మృతుడి కుటుంబానికి రూ. 35 లక్షల ఎక్స్‌గ్రేషియా

కాకతీయఖని (ఆంధ్రజ్యోతి): ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-3 క్వారీలో జరిగిన వోల్వా ట్రక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన అన్వర్‌పాషా కుటుంబానికి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రూ. 35 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇప్పిస్తున్నట్లు సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి కోలా నాగేంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి అందించిన సహకారంతో మృతుడి కుటుంబానికి తక్షణ సాయం అందిందని పేర్కొన్నారు. అంత్యక్రియల కోసం రూ. లక్షను కాంట్రాక్టర్ ద్వారా ఇప్పించామని తెలిపారు. ఈ నెల 25న రూ. 20 లక్షలు మృతుని కుటుంబానికి అందించేలా, మిగిలిన సొమ్మును 60 రోజుల్లో ఇచ్చేలా అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

మంగపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురంలో బుధవారం మంగపేట ప్రొబేషనరీ ఎస్సై ఎం. సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో డ్రగ్స్, గంజాయి, మాదక దవ్యాలపై డాగ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు గ్రామంలోని బూర్గంపహాడ్- ఏటూరు నాగారం ప్రధాన రహదారికి ఇరువైపులా పాన్‌షాపులు, కిరాణ షాపుల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందడంతో ఏక కాలంలో దాడులను నిర్వహించారు. ప్రతి షాపునూ క్షుణ్ణంగా డాగ్ స్క్వాడ్ బృందాన్ని ములుగు జిల్లా కేంద్రం నుంచి తీసుకొచ్చి సోదాలు చేపట్టారు. అనంతరం పీఎస్సై సురేష్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో పోలీస్ సిబ్బంది మహేష్, శ్రీకాంత్, డాగ్ స్క్వాడ్, డ్రగ్స్ గంజాయి స్పెషలిస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం కోసం పోరు

(5వ పేజీ తరువాయి)

సహా పలువురు భూనిర్వాసితులు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఆదివాసీ నాయకులతో మహదే వపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రైతులకు న్యాయం చేయా లని, దీనిపై కలెక్టర్, ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఎల్కేశ్వరంలో చిన్నకాళేశ్వరం మెయిన్ కెనాల్ ట్రెంచ్ పనులను అడ్డుకున్న నేపథ్యంలో కలెక్టరు రాహుల్ శర్మ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో పాటు అడిషనల్ కలెక్టర్, ఎస్పీతో ప్రత్యేక సమావేశమై ఈ సమస్యను సమీక్షించారు. మంత్రి శ్రీధర్‌బాబు సైతం ఎల్కేశ్వరం ఘటనపై ఆరా తీసి అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఇదే క్రమంలో ఎల్కేశ్వరం, బొమ్మాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 20మంది రైతులు పరిహారం విషయమై కలెక్టర్‌ను కలవగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రస్తుతం కెనాల్ కోసం మాత్రమే హద్దులు ఏర్పాటు చేస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందాల్సి అవసరం లేదని రైతులతో కలెక్టర్ చెప్పినట్లు సమాచారం.

కెనాల్ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యేనాటికి భూములు కోల్పోతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని కలెకర్ హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. బుధవారం ఎల్కేశ్వరం శివారులో కెనాల్ హద్దుల ఏర్పాటు పూర్తికావ డంతో ముక్తిపెల్లి శివారులో హద్దులు ఏర్పాటు ప్రారంభించారు. ఎల్కేశ్వరం, ముక్తిపెల్లి శివా రుకు మధ్యలో కొంత అటవి భూమి ఉండగా అది అటవీ అధికారుల పర్యవేక్షణలోనే హద్దు లను ఏర్పాటు చేస్తామని ఇరిగేషన్ అధికారులు చెప్పారు.

ఇప్పటికే ఆభూమి ఇరిగేషన్ పరిధిలో ఉన్నప్పటికీ అటవీ అధికారుల సమక్షంలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

మ్యాజిక్ డ్రైవర్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి : నాగజ్యోతి

ఏటూరునాగారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ డ్రైవర్ బాస నాగరాజు మృతి కేవలం ప్రభుత్వ హత్యనే అని, ఆయన మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించానలని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండల కేంద్రానికి చెందిన నాగరాజు కుటుంబాన్ని బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పరిమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ అటో, మ్యాజిక్ డ్రైవర్ల కుటుంబాలు పూర్తిగా వాహనా లపైనే వారి జీవితాలు ఆధారపడి ఉన్నాయని, ప్రభుత్వం వారికి గుర్తించి వెంటనే ఆదుకోవాలన్నారు. మృతుడు నాగరాజు కుటుం బానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుం దని తెలిపారు. ఆమె వెంట మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజాపాషా, మాజీ జడ్పీజీసీ రామ సహాయం శ్రీనివాస్‌రెడ్డితో పాటు మండల పార్టీ నాయకులు ఉన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

మల్హర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఉపాధిహామీ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఉంటుందని ఏపీవో హరీష్ బుధవారం తెలిపారు. మండలంలో 15 జీపీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు రూ 7.27 కోట్ల పనులు జరగ్గా తనిఖీ బృంధాలు పనులను పర్యవేక్షించారని గ్రామాల్లో గ్రామసభలు కూడా నిర్వహించినట్లు తెలిపారు.

దోపిడీ పార్టీల నుంచి విముక్తి పొందాలి : సీపీఎం

గోవిందరావుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బడా పెట్టుబడిదారులు, భూస్వాముల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ దోపిడీ పార్టీల చెర నుంచి ప్రజలు విముక్తి చెందాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. బుధవారం మండలం లోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకుడు కోలెపాక మహేందర్ ఆధ్వర్యంలో కురుసం ముత్త య్య, మంద అశోక్, బుద్దుల పైడి, దేవేందర్, వెంకటేష్, లావణ్యతోపాటు పది కుటుంబాల వారు సీపీఎంలో చేరగా ఆయన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసంద ర్భంగా సాంబశివ మాటా ్డుతూ గ్రామంలోని పేద, బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. బూర్జువా పార్టీలను ప్రజలు వీడి హక్కుల కోసం పోరాడుతున్న ఎర్రజెండా సీపీఎంపార్టీలో చేరి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు, మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు తీగల ఆగిరెడ్డి, గొంది రాజేష్, అంబాల మురళి, తదితరులు పాల్గొన్నారు.